ఈ నెల 20 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 17: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి నెల రోజులపాటు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జహీరాబాద్, గజ్వేల్‌లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అండర్-14, 16, 19, 23 కేటగిరీల బాల బాలికలకు శిక్షణ ఉంటుందన్నారు. క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ www.hycricket.org ఆన్‌లైన్ లింక్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలి. క్రీడాకారులు ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలని స్పష్టం చేశారు. ఈ శిబిరాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మే నెలలో జరిగే జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు. సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీ గ్రౌండ్స్, మెదక్ స్పోర్ట్స్ స్టేడియం, సిద్దిపేట ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియం, జహీరాబాద్‌లోని సంగమిత్ర, గజ్వేల్ ఐఓసీ గ్రౌండ్‌లలో శిబిరాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

ఎల్లమ్మ ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం

మంత్రికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

అందోల్, ఏప్రిల్ 17: మండల పరిధిలోని కన్సాన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలంటూ బుధవారం గ్రామ గౌడ సంఘం నాయకులు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో ఉత్సవాలు ఉంటాయని, తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఉత్సవాలకు వస్తానని చెప్పారని మాజీ సర్పంచ్ యాదాగౌడ్ తెలిపారు. సంఘం నాయకులు సంగమేశ్వర్‌గౌడ్, రమేశ్‌గౌడ్, అశోక్ గౌడ్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా శివాజీరావు పాటిల్

న్యాల్‌కల్, ఏప్రిల్ 17: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా శివాజీరావుపాటిల్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. మండలం ఆత్మూర్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ శివాజీరావుపాటిల్‌ను ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఆయనతోపాటు ఉపాధ్యక్షులుగా అయ్యప్పస్వామి, సురేశ్ పూరి, శంకర్‌సాగర్, అల్లాపూర్ రాజుపాటిల్, ప్రధాన కార్యదర్శులుగా నాయికోటి రాములు, గోవిందర్‌రావు, కోశాధికారులుగా ఉదయ్‌కుమార్, మోహన్, సంగమేశ్‌పాటిల్, సందీప్‌గోడ్‌లను నిమమించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివాజీరావు పాటిల్ తనపై నమ్మకం ఉంచి పదవిని అప్పగించినందుకు జిల్లా, తాలుకా, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీచేస్తున్న బీబీ పాటిల్‌ను గెలిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు.

చెరువులో పడి యువకుడు మృతి

అందోల్, ఏప్రిల్ 17: చెరువులో పడి యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం అన్నాసాగర్ చెరువులో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. పుల్కల్ మండలం సింగూర్ గ్రామానికి చెందిన గొల్ల బీరప్ప(25) సింగూర్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్లలో ఉంటున్నాడు. బుధవారం అన్నాసాగర్ చెరువులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు జోగిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కిడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి జోగిపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మువకుడిది అత్యా..? లేకా ఆత్మహత్యనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడు గత వారం సింగూర్‌లో జరిగిన మహిళా హత్య కేసులో నిందితుడిగా ఉండడం? బుధవారం అతను కూడా చెరువులో మునిగి మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తుందని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.



పటాన్‌చెరు: సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు



కంది: చేర్యాల్‌లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



హత్నూర: నస్తీపూర్‌లో సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర: మాధుర శివారులోని దత్తాచలక్షేత్రంలో సీతారాముల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు తెస్తున్న మంత్రి దామోదర

కమనీయం రాములోరి కల్యాణం

పెండ్లి తంతును వీక్షించి తరించిన భక్తజనం

- భక్తులతో కిటకిటాలాడిన ప్రముఖ ఆలయాలు
- పల్లెలు, పట్టణాల్లో ఆధ్యాత్మిక శోభ
- సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు

శ్రీరామనవమిని పురస్కరించుకొని జిల్లాలోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అర్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ తంతును వీక్షించేందుకు భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పలు చోట్ల నిర్వహించిన భజన కీర్తనలు అలరించాయి. రాములోరి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సీతారామ, లక్ష్మణ విగ్రహాలతో పల్లకీ సేవ నిర్వహించారు. జైశ్రీరామ్ నామస్మరణలతో గ్రామాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. స్థానిక ఎమ్మెల్యేలు వారి పరిధిలో జరిగిన జనకీరాముల పెండ్లి వేడుకకు హాజరయ్యారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 17

కోహీర్: జహీరాబాద్‌లోని రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

కల్హేర్: కల్హేర్‌లోని రామాలయంలో పూజలు చేస్తున్న బీబీ పాటిల్

బొల్లారం: సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి దంపతులు

రామచంద్రాపురం: భారతీనగర్‌లో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రామచంద్రాపురం: సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి దంపతులు

నారాయణఖేడ్: జనకీరాముల కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి దంపతులు

జిన్నారం: శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

జహీరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలతో ఎమ్మెల్యే మాణిక్‌రావు

హజ్ యాత్ర పవిత్ర కార్యం

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, ఏప్రిల్ 17: ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లడం వారి జీవితంలో అతి పవిత్రమైన కార్యమని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని మసీదు నుంచి హజ్‌కు బయలుదేరే ముస్లింల యాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో ఒక్కసారైనా హజ్‌కు వెళ్లాలని ముస్లింలకు ఉంటుందన్నారు. జహీరాబాద్ నుంచి హజ్‌కు వెళ్తున్న ముస్లింలను అభినందించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, తంజీమ్, అక్బర్, మూర్తుజా, పర్వేజ్, మహ్మద్‌అలీ, హాశం, జాఫర్‌అలీ, అత్హర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో భూ రిజిస్ట్రేషన్

వ్యక్తి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

నిందితుడు మనోజ్‌కుమార్‌జైన్

రామచంద్రాపురం, ఏప్రిల్ 17: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ గ్రామంలో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరుల పేరుపై భూమిని రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని బుధవారం కొల్లూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉండే మనోజ్‌కుమార్‌జైన్ అనే వ్యాపారి కొల్లూర్ గ్రామంలోని సర్వేనంబర్ 177లో 2.27గుంటల భూమికి సంబంధించిన యజమానులు గతంలో ఆ భూమిని ఇతరులకు విక్రయించారు. పహాణీలో మాత్రం భూ యజమానుల పేర్లు మార్పు జరుగకపోవడంతో ఈ విషయం గ్రహించిన మనోజ్‌కుమార్‌జైన్ ఇదే అదునుగా భావించి పహాణీలో పేర్లున్నవారి కుటుంబసభ్యులతో కుమ్మక్కై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించాడు. ఆ భూమిని 2006లో తన పేరుపైన రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే సంబంధిత భూమి రికార్డుల్లో మాత్రమే ఉంది, ప్రత్యక్షంగా లేదు. ఆ డాక్యుమెంట్లను చూపించి 2023లో కమిడి రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అదే సర్వే నంబర్‌లోని ఇతరుల భూమి హద్దులు చూపించి విక్రయించాడు. అయితే ఆ భూమిని కొనుగోలు చేసిన కమిడి రియాలిటీ సంస్థ వారు మనోజ్‌కుమార్‌జైన్ చూపించిన భూ హద్దుల ప్రకారం సుభాష్‌గౌడ్ అనే వ్యక్తికి సంబంధించిన భూమి చుట్టూ ప్రహరీ నిర్మించారు. విషయం తెలుసుకున్న సుభాష్ గౌడ్ కొల్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణలో భాగంగా మనోజ్‌కుమార్‌జైన్‌ని అదుపులోకి తీసుకొని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

బొల్లారం, ఏప్రిల్ 17: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివసించే జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఉపేందర్ భార్య మీనాక్షి దేవి(25) బుధవారం మృతి చెందింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి స్థానిక సంఘ సేవకుడు ఆనంద కృష్ణారెడ్డి అండగా నిలుస్తూ సొంత ఖర్చుల తో దగ్గరుండి అంతిమ సంస్కారాలు చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగకు మంత్రికి ఆహ్వానం

మంత్రి పొన్నంకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న వింజపల్లి గ్రామస్తులు

కోహెడ, ఏప్రిల్ 17: మండలంలోని వింజపల్లిలో గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న బొడ్రాయి కార్యక్రమానికి హాజరుకావాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు గ్రామ పెద్దలు బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, సర్పంచ్ తిరుపతిరెడ్డి, రాజేశ్వర్‌రావు, కనకారెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు సిద్ధం

సంగారెడ్డిలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరుగుతున్న ఏర్పాట్లు

సంగారెడ్డిలో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

- లోక్‌సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణకు సంగారెడ్డి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు సంబంధించి బుధవారం ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అవలంబించాల్సిన విధానాలను వివరించారు. నిర్ణీత గడువులోగా, సెలవు రోజు మినహాయించి మిగతా రోజుల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్టు వెల్లడించారు. ఒక అభ్యర్థి 4 సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 26న నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉందన్నారు. నామినేషన్ దాఖలు చేసే జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ జమ చేయాల్సి ఉంటుందన్నారు. స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్‌ను 10 మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు పార్టీ కండువాలు, టోపీలు ధరిస్తే ఆర్ఓ కార్యాలయంలోకి అనుమతించరని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఇతర సెగ్మెంట్‌కు చెందిన వారైతే అక్కడి ఈఆర్ఓ నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు.

క్రిమినల్ కేసులుంటే నామినేషన్‌లో పొందుపర్చాలి

అభ్యర్థులు తమపై ఏమైనా క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3లో వాటి వివరాలను విధిగా పొందుపర్చాలని రిటర్నింగ్ అధికారి స్పష్టం చేశారు. ఒక్కో అభ్యర్థి గరిష్టంగా రూ.95 లక్షల వ్యయం చేసేందుకు పరిమితి ఉన్నదన్నారు. వ్యయం పూర్తిగా ప్రత్యేక బ్యాంక్ ద్వారానే జరగాలని స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థి, లేదా ప్రతిపాదించిన వారే స్వయంగా హాజరై నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు ఆర్ఓ సమక్షంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ చేయాల్సి ఉంటుందన్నారు. గడిచిన 10 ఏండ్లలో అభ్యర్థులు ప్రభుత్వ క్వార్టర్లలో ఉంటే నీటి బిల్లులు, కరెంట్ బిల్లుల వంటి బకాయిలు లేవని నోడ్యూ సర్టిఫికెట్ జత చేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ సమర్పించే ముందు అన్ని అంశాలను క్షుణ్ణంగా చూసుకోవాలన్నారు. అభ్యర్థుల కోసం ఆర్ఓ కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వారిని దావాఖానకు తరలిస్తున్న హైవే సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

అందోల్, ఏప్రిల్ 17: కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సంగారెడ్డి నుంచి ఓ కుటుంబం కారులో నారాయణఖేడ్ వైపునకు వెళ్తుండగా నేరడిగుంట వద్ద అదుపు తప్పి పొల్లాలోకి దూసుకు వెళ్లి బోల్తా కొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. వీరంతా ఓ వివాహానికి వెళ్తూ ప్రమాదం బారీన పడ్డారు. 4గురు స్వల్పంగా గాయపడగా ఒకరికీ తీవ్ర గాయాలయ్యాయి. హైవే సిబ్బంది వారిని జోగిపేట ప్రభుత్వ దవఖానాకు తరలించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

జిన్నారం, ఏప్రిల్ 17: మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో బీజేపీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోటుకు వెళ్లి బీజేపీకి ఓట్లేయాలని అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపాధి హామీ కూలీలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, ఎన్.రఘు, లక్ష్మణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ

సమావేశంలో కలెక్టర్, ఇతర అధికారులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరరు జాబితా రూపకల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈసీ మాట్లాడుతూ.. పెండింగ్ ఓటరరు నమోదు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, ఏప్రిల్ 26 నాటికి తుది ఓటరరు జాబితా రూపొందించాలన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు స్లిప్పులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ముందస్తుగానే ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో సిద్దిపేట కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కోహీర్, ఏప్రిల్ 17: చెడు అలవాట్లను విడిచిపెట్టి ప్రతిఒక్కరూ సన్మార్గంలో పయనించాలని ఎస్సై కృష్ణయ్య సూచించారు. బుధవారం మండలంలోని కవేలి గ్రామంలో యువకులకు పలు సూచనలు చేశారు. పేకాట ఆడడం, గంజాయి తాగడం, విక్రయించడం, ఆన్‌లైన్ బెట్టింగ్, ఫోన్లలో అశ్లీల వీడియోలు చూడడం, చిత్రీకరించడం, తదితర చెడు అలవాట్లను విడనాడాలన్నారు. చెడు అలవాట్లకు బానిసలు అయితే జీవితం బుగ్గిపాలు అవుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై కిష్టయ్య, పోలీసులు ఉన్నారు.

కవేలిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కృష్ణయ్య

పిచ్చి మొక్కలు తొలిగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

కంది, ఏప్రిల్ 17: కంది మండలం మక్తఅల్లూర్ గ్రామంలో బుధవారం విద్యార్థులు శ్రమదానం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్‌కు చెందిన విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా రెండు రోజులుగా గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలిగించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.